క్లుప్తంగా

నేడు అన్నదాత సుఖీభవ

నగరి: అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు అందించే పెట్టుబడి సాయం శనివారం నుంచి వారి ఖాతాలకు జమ అవుతుందని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాయం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ సాయం రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. 4702 మంది రైతులను ఈ పథకంలో అర్హులుగా గుర్తించామన్నారు.

అయ్యప్పరాజు కండ్రిగ రోడ్డు సమస్య పరిష్కారం


రోడ్డు సమస్య పరిష్కరిస్తున్న తహశీల్దార్ అరుణకుమారి

కార్వేటినగరం: పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ అయ్యప్పరాజు కండ్రిగ గ్రామానికి పోతున్న రోడ్డు సమస్యను శుక్రవారం తహశీల్దార్ అరుణకుమారి పరిష్కరించారు. కొన్నేళ్లుగా అయ్యప్ప రాజుకండ్రిగ గ్రామానికి పోతున్న రోడ్డు విషయంలో అదే గ్రామానికి చెందిన రైతుతో గ్రామస్తులకు వివాదం నెలకొంది. ప్రస్తుతం గ్రామస్తులను, అదే గ్రామానికి చెందిన రైతుకి నచ్చజెప్పి జిల్లా సర్వేయర్ రవిశేఖర్, పోలీసుల సహాయంతో సర్వే చేసి రాళ్లు నాటారు. వెంటనే గ్రామస్తులు జేసీబీ సహాయంతో మట్టితోలి రోడ్డు వేసుకున్నారు. చాలా రోజులుగా రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు రోడ్డు వేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్వే ఏడీ ఎస్ఐ చిన్నరెడ్డప్ప, ఆర్ఐ దేవి, వీఆర్ఓ తంగరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పీర్ల ఊరేగింపు


పీర్లను ఊరేగిస్తున్న అబ్బాస్ నగర్ ముస్లింలు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రం జీడీనెల్లూరు గ్రామంలో శుక్రవారం ముస్లిం మత పెద్దల త్యాగాలకు ప్రతీకగా ముస్లింలు రక్త తర్పణం, పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా చేపట్టారు. అంజుమనే ఈ హైదరీ కమిటీ ఆధ్వర్యంలో జీడీ నెల్లూరు అబ్బాస్ నగర్ కాలనీ గ్రామంలో మొహర్రం సందర్భంగా పూర్వ ముస్లిం మత పెద్దల కుటుంబీకుల త్యాగాలకు ప్రతీకగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తి గీతాలతో యువకులు రక్త తర్పణం చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆవలకొండ, బాలగంగనపల్లి, చుట్టుపక్కల గ్రామాలు, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా నుంచి ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


రక్త తర్పణం చేస్తున్న ముస్లింలు

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని ఎల్ఎల్‌బీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై తాలూకా పోలీసులు దాడులు చేశారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, రూ.6వేల నగదు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, పోలీసులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

పుత్తూరు: గంజాయి, ఎర్రచందనం తదితర అక్రమ రవాణా, మట్కా వంటి జూదాలకు పాల్పడినా పీడీ యాక్ట్ నమోదు చేసి తగిన చర్యలు తీసుకొంటామని సీఐ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతు్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్ఐ ఓబయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి చెక్ పెట్టండి


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ చౌర్యానికి అధికారులు చెక్ పెట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో డీపీఈ(విద్యుత్ చౌర్యం నివారణ) విభాగం అధికారులతో సమావేశమై ఆయన మాట్లాడారు. నగర, మండల, గ్రామ స్థాయిలో తరుచూ తనిఖీలు చేయాలన్నారు. ప్రధానంగా విద్యుత్ చౌర్యం సంస్థ ఆదాయానికి లోటుగా మారుతోందని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీపీఈ ఈఈ హరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం.. బహుదూరం

- రోగులు చెప్పే నొప్పికే మందులు
- రోగులపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- ఆరోగ్యకేంద్రంలో బీకాంప్లెక్స్ మాత్రల కొరత


కార్వేటినగరం సామాజిక ఆరోగ్యకేంద్రం


బదిలీపై వెళ్లిన అధికారుల ఫోన్ నంబర్లతో దర్శనమిస్తున్న డ్యాష్ బోర్డు

కార్వేనగరం: గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో మండల కార్యాలయం సముదాయంలో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అయితే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోంది. దీంతో వైద్యాధికారులు కూడా అందుకు అనుగుణంగా వ్యవ్యవహరిస్తున్నారు. డాక్టర్లే దేవుళ్లుగా భావించి వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు రోగులను చాలా చులకన భావంతో చూస్తూ కనీసం చేయిపట్టి నాడి కూడా చూడకుండా, రోగనిర్ధారణ చేయక, రోగులు చెప్పే వ్యాధులకే మందులు రాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయంలో విధులు నిర్వహించే వైద్యసిబ్బంది రోగులతో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విరుచుకు పడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. బీ విటమిన్ మందు బిళ్లలతో పాటు పలు రకాల వ్యాక్సిన్‌లు అందుబాటులో లేవని, ప్రభుత్వం సరఫరా చేయడం లేదంటూ వైద్య సిబ్బంది సమాధానం చెబుతున్నట్లు సమాచారం. వైద్య సిబ్బంది నిర్లక్ష్య సమాధానాలకు విసిగి వేశారిన కొందరు ప్రాణాలను అరచేత పట్టుకుని పుత్తూరు, తిరుపతిలోని కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని అంటున్నారు.

నిర్లక్ష్య ధోరణి

అధికారులు మారి కొన్ని నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు డ్యాష్ బోర్డులో పాత అధికారుల ఫోన్ నంబర్లు మాత్రమే నేటికీ దర్శనమిస్తున్నాయి. అత్యవసరానికి ఫోన్లు చేసినా కార్వేటినగరం నుంచి బదిలీపై వచ్చేశామని సమాధానం వస్తోంది. కనీసం బదిలీపై వెళ్లిన అధికారుల ఫోన్ నంబర్లు తొలగించడం లేదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు డ్యాష్ బోర్డులో పెట్టే సమయం కూడా లేదా అని వైద్య సేవల కోసం వచ్చిన వారు ప్రశ్నిస్తున్నారు. రోజువారీ విధులు నిర్వహించే వైద్యుల సెల్‌నంబర్లతో పాటు, వారి పేర్లను డ్యాష్ బోర్డులో ప్రదర్శించాలంటున్నారు.

స్వచ్ఛమైన తాగునీటితో సంపూర్ణ ఆరోగ్యం


వాటర్ ప్లాంట్‌ని పరిశీలిస్తున్న సీఈఓ తదితరులు

కార్వేటినగరం: ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. శుక్రవారం పాలసముద్రం మండలంలోని గుట్టమీద ఇండ్లు, వనదుర్గాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి గ్రామానికి ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ తప్పకుండా చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో మినరల్ వాటర్‌ప్లాంటు నుంచి తాగునీరు పట్టకునే అవకాశం ఉందని, మండల ప్రజలు బాధ్యతగా వాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా మండల పరిధిలో గ్రీన్ అం బాసిడర్లు ఇంటింటికి వెళ్లి తీసుకొస్తున్న తడి, పొడి చెత్తలను సేకరించాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ విద్యావతి, విస్తరణాధికారి సత్యనారాయణ, కార్యదర్శులు సుధ, శంకర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ


నరసింహారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కృపాలక్ష్మి

వెదురుకుప్పం: మండలంలోని బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ యువత అధ్యక్షుడు గణపతిరెడ్డి కుటుంబాన్ని గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. గణపతిరెడ్డి తాత నరసింహారెడ్డి గురువారం మృతి చెందాడు. దీంతో శుక్రవారం నరసింహారెడ్డి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి రామయ్య, పంచాయతీ వింగ్ కార్యదర్శి గోవిందయ్య, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, యువత నాయకుడు నరేష్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు భీమశంకర్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, నరసింహారెడ్డి, పరంధామరెడ్డి ఉన్నారు.

వాతావరణ ఆధారిత సేద్యంతో లాభాలు


మాట్లాడుతున్న ఏడీ వేణుగోపాలరావు

వడమాలపేట (విజయపురం): వాతావరణ ఆధారిత సేద్యం రైతులకు ఎంతో లాభదాయకమని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం వడమాలపేట మండల కేంద్రంలో పీఎం ఆర్కేవీవై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారు రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట విత్తే సమయాన్ని, సాగు చేయాల్సిన పంట రకాలను రైతులు ఎంచుకోవాలన్నారు. ఒకే రకమైన పంటను లేదా ఒకే రకాన్ని ఎప్పుడూ సాగుచేయడం ద్వారా దిగుబడి తగ్గడమే కాక, చీడపీడలు ఎక్కువగా ఉంటాయన్నారు. మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాలను, పంటల బీమా పథకాన్ని వివరించారు. పంటల బీమా కట్టుకోవాల్సిన వారు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మోహన్, శ్రీవాణి, మోహన్ రాజా, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆడి శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో ఓంశక్తి, ఆలయం వద్ద అంబలి పోస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని నగరి ఓం శక్తి ఆలయంలో ఆడి నెల మూడో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్థానిక మహిళా భక్తులు ఎరుపు వస్త్రాలు ధరించి అమ్మవారికి గంజి, అంబలి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు విచ్చేసిన భక్తులందరికీ అన్నదానం చేశారు. దీంతో ఆలయ ఆవరణలో సందడి నెలకొంది.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నగరి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు మూకుమ్మడిగా శుక్రవారం విధులను బహిష్కరించారు. కోర్టు వెలుపల నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ కుప్పం కోర్టులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక నకిలీ న్యాయవాది తనను బార్ అసోసియేషన్‌లో చేర్చుకోవాల్సిందిగా కోరాడని తెలిపారు. అతని ప్రవర్తనలో అనుమానాలు ఉండడంతో బార్ అసోసియేషన్ అతని సర్టిఫికెట్లను తెమ్మని పరిశీలించగా అవి నకిలీ సర్టిఫికెట్లని తేలాయన్నారు. దీంతో అతను నకిలీ న్యాయవాదని తేలడంతో అసోసియేషన్‌లో చేర్చుకోవడానికి నిరాకరించారన్నారు. ఆగ్రహించిన ఆ నకిలీ న్యాయవాది కుప్పం కోర్టులోని సీనియర్ న్యాయవాదులు, సభ్యులపై దాడి చేశారన్నారు. ఆ దాడిని నగరి బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించిందన్నారు. దాడి చేసిన నకిలీ న్యాయవాదిపై జిల్లా ఎస్పీ తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుప్పం బార్ అసోసియేషన్‌కు తమ మద్దతు పూర్తిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేసన్ అధ్యక్షుడు వేలాయుధం, కార్యదర్శి జాన్ జోష్, సీనియర్ న్యాయవాదులు మురళీధర్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఉదయభాను, సోమ సుందరం, ఈజీ బాబు, నాగరాజు, తిరుమల పాల్గొన్నారు.

సత్తా చాటిన పుత్తూరు విద్యార్థులు


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: చిత్తూరు పీవీకేఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి వ్యాస రచన, ఉపన్యాస పోటీలు రెండింటిలోనూ ప్రథమ బహుమతులను పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గెలుచుకొన్నారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 ఏళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. పోటీలలో పుత్తూరు కళాశాలకు చెందిన బీబీఏ తృతీయ ఏడాది చదువుతున్న పూజారి లావణ్య వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం గెలుచుకోగా, బీకాం (సీఏ) తృతీయ సంవత్సరం చదువుతున్న టి.వరలక్ష్మీ ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానం కైవసం చేసుకొంది. శుక్రవారం కళాశాలలో బహుమతులు గెలుచుకొన్న విద్యార్థినులను అధ్యాపక బృందం అభినందించింది. కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులు చదువులు, పరీక్షలకే పరిమితం కాకుండా వివిధ రకాల పోటీలలో పాల్గొనడం ద్వారా ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చునని అన్నారు. జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకొన్న విద్యార్థినులు కడపలో జరగనున్న జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

- బకాయిల చెల్లింపుల కోసం నేడు ధర్నా
- ఫ్యాప్టో నగరి డివిజన్ శాఖ

నగరి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ బడులలో పని చేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.మణిగండన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో నాయకులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం శనివారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామని, ఉపాధ్యాయులు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలని, బకాయిలను చెల్లించాలని, పలుమార్లు ఉద్యమాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమన్నారు. అందుకే ఫ్యాప్టో తరపున ధర్నా చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పీఆర్ మునిరత్నం, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, నాగభూషణం, యువరాజ్, రూబన్, ప్రకాష్, సంతోష్ కుమార్, హరీష్, సురేష్ బాబు, జనార్ధన్, హరిప్రసాద్, గణేష్, మోహన్, భాగ్యరాజ్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు


నింద్రలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ


పౌష్టికాహార వివరాలు తెలుపుతున్న సీడీపీఓ

కార్వేటినగరం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలింతలు తల్లిపాల సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు ఇవ్వడంతో బిడ్డకే కాదు తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా రక్షణ లభిస్తోందన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకూ తల్లిపాలు తాగించాలని సూచించారు. తల్లి పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయని, రోగాలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అపోహలకు పోయి పోత పాలు పట్టిస్తే బిడ్డ ఎదుగుదలతో పాటు, అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది నౌహిదా, హెల్పర్ రజనీ, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది కవిత తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ

నింద్ర: మండలంలోని కొప్పేడు దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా నేడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ శ్యామల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు తల్లి పాలను మాత్రమే అందించాలని అన్నారు. అటు తరువాత అదనపు పోషకాలు అందించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. అనంతరం కొప్పేడు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది గోపి, ప్రసాద్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి

నగరి: ముర్రుపాలు పట్టించడాన్ని తల్లులు భారం అనుకోరాదని సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కీళపట్టు, రూరల్ మండలం కావేటిపురంలో ఆమె తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాల విశిష్టతను ఆమె వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలన్నారు. బిడ్డకు 2 సంవత్సరాలపాటు తల్లి పాలు కొనసాగించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. తల్లులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన ఏర్పరిచారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ తల్లిపాలు తాగించడంతో తల్లికి, బిడ్డకు మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుందన్నారు. జబ్బులు, రోగాలు రాకుండా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఎంఎస్‌కేలు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఆరంభం

- వైభవంగా ధ్వజారోహణం
- భక్తుల స్వహస్తాలతో శ్రీకృష్ణుడికి పాలాభిషేకం
- సుమంగళి పూజలు నిర్వహించిన మహిళలు


గెరిగ ఊరేగింపు


శ్రీకృష్ణుడికి పాలాభిషేకం


సుమంగళి వ్రతం చేస్తున్న మహిళలు

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి 9 గంటలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ధ్వజ స్తంభానికి పూజలు చేసి ధ్వజపటం ఎగురవేశారు. అంతకు ముందు ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. 7 గంటలకు గోపూజ, శ్రీకృష్ణుడికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలత హరికథా గానం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శనివారం ఉదయం తీర్థోత్సవం ప్రారంభం. 6 గంటలకు గెరిగ ఊరేగింపు. మధ్యాహ్నం 3 గంటలకు పాండవ, కౌరవుల జనన ఘట్టం. రాత్రి 8 గంటలకు పులి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి ఊరేగింపు ఉంటుంది.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

బంగారుపాళెం: వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే మురళీ మోహన్, చైర్మన్‌గా భాస్కర్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌తో పాటు 17 మంది డైరెక్టర్లుగా ప్రమాణం చేశారు.

ప్రతి విద్యార్థికీ ఆధార్

గుడిపాల: మండలంలోని ప్రతి విద్యార్థికీ ఆధార్ కార్డులు ఇవ్వనున్నట్లు మండల విద్యాశాఖాధికారి హసన్‌బాషా తెలిపారు. శుక్రవారం గుడిపాల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేకపోవడంతో వారందరినీ వసంతాపురం సచివాలయంలో ఆధార్ సెంటర్‌కు రప్పించి, ఆధార్ కార్డులు తీయించారు.